
ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 339 శుక్రవారం 6-12-2024 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

# అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత

- ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున నిధులు
- పరిపాలనా అనుమతులు కూడా ఇచ్చేశాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
- లబ్ధిదారుల ఎంపిక ప్రత్యేక మొబైల్ యాప్
- సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్ల యాప్‌ను ఆవిష్కరించిన సీఎం



**హైదరాబాద్,డిసెంబర్ 5:** ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అందుకే లబ్ధికారుల ఎంపికపై ఎలాంటి విమర్శలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను జోడించి ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. గురువారం తెలంగాణ సచివాలయంలో ఈ యాప్‌ను ఆవిష్కరించారు. ఇండ్ల లబ్ధికారుల ఎంపికపై సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. దీనికి సంబంధించిన 10 ముఖ్యమైన అంశాలు విధించారు. ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యం ఎంత గొప్పదైనా.. అమలులో లోపాలుంటే ప్రభుత్వంపై విశ్వసనీయత దెబ్బతింటుంది. పేదవారికి అన్యాయం జరుగుతుంది. అందుకే సాంకేతిక నైపుణ్యాన్ని జోడించి ఇళ్లు అనర్హులకు చెందకూడదని ప్రత్యేకంగా యాప్ అందుబాటులోకి తెచ్చామని రేవంత్ రెడ్డి వివరించారు. ఇందిరమ్మ ఇండ్లను ప్రాధాన్యత క్రమంలో కేటాయిస్తామని.. అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత కింద ఇండ్ల కేటాయింపు జరుగుతుందని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్స్... ఈ క్రమంలో ప్రాధాన్యత ఇస్తూ ఇండ్లను కేటాయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. లబ్ధిదారులు తమకున్న స్థలాన్ని గరిష్టస్థాయిలో వినియోగించుకుని నిర్మించుకునేలా.. ప్రతి మండల కేంద్రంలో ఒక నమూనా ఇంటిని నిర్మించి చూపిస్తామని రేవంత్ వివరించారు. అచ్చం అలాగే కట్టాలని కాకుండా అవగాహన కోసం మాడల్ హౌజ్‌ను చూపిస్తామని చెప్పారు. మొదట ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్ల కేటాయింపు ఉంటుందని రేవంత్ స్పష్టం చేశారు. మొత్తంగా 4.50 లక్షల ఇండ్లకు ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున నిధులకు పరిపాలనా అనుమతులు ఇచ్చామని వెల్లడించారు. ఆదివాసీలు, ఆదివాసీ తండాలు (ఐటీడీఏ తండాలకు) జనాభా ప్రాతిపదికన ప్రత్యేకంగా పరిశీలించి అదనంగా కొన్ని వేల ఇండ్లను నిర్మిస్తామని సీఎం ప్రకటించారు. ఇప్పుడు కేటాయించిన ఇండ్లు కాకుండా ఆదివాసీలకు ప్రత్యేక కోటా ఇస్తామని చెప్పారు. గతంలో రుణాలు తీసుకుని ఇండ్లు కట్టుకున్న 7 వేల కుటుంబాల రుణాలను కూడా.. ప్రభుత్వం తీర్చి వారిని రుణ విముక్తులను చేస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. పెరిగిన ధరలు, పేదవాడి అవసరాలను దృష్టిలో పెట్టుకుని వారికి ఇండ్లు కట్టుకోవడానికి అండగా నిలవాలని.. ఈ పథకం తీసుకొచ్చినట్టు సీఎం వివరించారు. అందుకే ప్రతి పేద వాడికి 5 లక్షలు ఇచ్చి ఇండ్లు కట్టుకోవడానికి ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ఈ పథకంలో పేదలకు వెసులుబాటు కల్పిస్తూ విధివిధానాలను నిర్ణయించామని సీఎం రేవంత్ చెప్పారు. అదనంగా ఒక గది కట్టుకుంటామంటే అందుకు వెసులుబాటు కల్పించామని వివరించారు. ఇదొక పండగ సందర్భమని.. ఇండ్లు కట్టించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఆత్మగౌరవంతో బతకాలన్నది ప్రతి ఒక్కరి కల అని.. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటిముందు వెలుగుల్లో పండగ చేసుకునే సందర్భమిదని అభిప్రాయపడ్డారు. కాగా తెలంగాణలో తొలిసారిగా అధికారంలో చేపట్టిన కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తి కావొస్తోంది. గత ఏడాది డిసెంబర్ 3న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాగా.. 9వ తేదీన కాంగ్రెస్ సర్కార్ పీఠమెక్కింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. అయితే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రధానంగా ఆరు గ్యారెంటీలను ప్రస్తావించింది. కాంగ్రెస్ ప్రకటించిన 'సిక్సర్' వర్కౌట్ కావటంతో%ొ% తెలంగాణలో అధికారంలోకి వచ్చింది.అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్%ొ% ప్రధానంగా ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి పెట్టింది. సీఎం రేవంత్ రెడ్డి తొలి సంతకం కూడా ఆరు గ్యారెంటీల హామీలపైనే చేశారు. అంతేకాదు%ొ% సచివాలయంలో తొలి కేబినెట్ భేటీ జరిగింది. ఇందులో కూడా ఆరు గ్యారెంటీల హామీల అమలుపైనే చర్చించారు. పథకాల అమలు కోసం ప్రజా పాలన అనే కార్యక్రమాన్ని చేపట్టింది. అన్ని గ్రామాల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది.

## ఇది ప్రజాస్వామ్య పాలన కాదు

- మాజీ మంత్రి హరీష్ రావు అరెస్ట్
- హరీష్‌తో పాటు కౌశిక్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మా నాయకుల అరెస్టులు అప్రజాస్వామికం..
- తక్షణం విడుదల చేయాలి
- రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ధ్వజం




హైదరాబాద్,డిసెంబర్ 5: మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని పరామర్శించడానికి వెళ్లిన సమయంలో పోలీసులు ఆయన్ని అడ్డుకున్నారు. బలవంతంగా అదుపులోకి తీసుకుని గచ్చిబౌలికి తరలించారు. హరీష్ రావును ఎందుకు అదుపులోకి తీసుకున్నారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై హరీష్‌రావుపై కేసు నమోదైంది. పాడి కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లిన సమయంలో అడ్డుకుని అదుపులోకి తీసుకోవడంతో గందరగోళం నెలకొంది. పోలీసులు వాహనంలోకి ఎక్కే ముందు హరీష్ రావు తీవ్రంగా ప్రతిఘటించారు. బంజారాహిల్స్‌లోని కౌశిక్ రెడ్డి నివాసానికి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు చేరుకుంటున్నారు. హ?రీశ్ రావుతో పాటు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.మరోవైపు హరీశ్ రావు అరెస్ట్ సందర్భంగా కౌశిక్ రెడ్డి ఇంటిని పోలీసులు ధ్వంసం చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో హరీశ్‌రావు అరెస్టును నిరసిస్తూ సిద్దిపేటలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు.. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హరీశ్‌రావును వెంటనే విడుదల చేయాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు.ఇక కౌశిక్ రెడ్డిని కలిసేందుకు వెళ్లిన హరీశ్‌రావును పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నది. ఏడాది పాలన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేస్తున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఇది ప్రజాస్వామ్య పాలన కాదు.. రాక్షస పాలన అని ధ్వజమెత్తారు. ఈ మేరకు హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. ఇందిరమ్మ రాజ్యమా..? ఎమర్జెన్సీ పాలనా..? అని నిలదీశారు హరీశ్‌రావు. ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్తే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై ఉల్టా కేసు బనాయించారు. ఉదయాన్నే పదుల సంఖ్యలో పోలీసులు ఎమ్మెల్యే ఇంటి మీదకు వచ్చి అక్రమ అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. ఈ దుర్మార్గాన్ని ప్రశ్నిస్తే, నాపై, బీఆర్ఎస్ నాయకులపై దుర్మార్గంగా ప్రవర్తించారు. అక్రమ అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్నారు. అడిగితే అరెస్టులు, ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే బెదిరింపులు. ప్రజాస్వామ్య పాలన అని డబ్బా కొడుతూ, రాక్షస పాలన కొనసాగిస్తున్నావు. నీ పిట్ట బెదిరింపులకు, అక్రమ కేసులకు భయపడే వాళ్ళం కాదు. తెలంగాణ సమాజమే నీకు బుద్ధి చెబుతుంది అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. కాగా ఏడాది పాలన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పులపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నలు సంధిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రశ్నల పరంపర కొనసాగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లనకు తరలిస్తున్నారు. ఇవాళ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పాడి కౌశిక్ రెడ్డి, జగదీశ్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి, ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ అరెస్టులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా రేవంత్ సర్కార్‌పై ధ్వజమెత్తారు.ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులు..! పార్టీ హామీలపై నిలదీస్తే అరెస్టులు..! చేస్తున్నారంటూ కేటీఆర్ మండిపడ్డారు. పాలనలో లోపాలను గుర్తు చేస్తే కేసులు.. గురుకులాల్లో విద్యార్థుల అవస్థలను పరిశీలిస్తే కేసులు.. ప్రభుత్వం లాక్కుంటున్న భూములపై ఎదిరిస్తే కేసులు.. ప్రభుత్వం కూల్చుతున్న ఇండ్లకు అడ్డొస్తే కేసులు.. ప్రభుత్వంలోని వ్యవస్థలను వాడుకుని దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే కేసులు.. చివరకు ప్రజలపై కూడా కేసులు నమోదు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం హింసిస్తుందని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

## జార్ఖండ్ మంత్రివర్గ విస్తరణ


**11మందికి చోటు... ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులు**




**రాంచి, డిసెంబర్ 5:** జార్ఖండ్ 14వ ముఖ్యమంత్రిగా జేఎమ్ఎమ్ నేత హేమంత్ సొరేన్ గతవారం ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన తన మంత్రివర్గ విస్తరణ చేపట్టారు. ఇందులో భాగంగా 11 మందికి చోటు కల్పించారు. వారంతా మంత్రులుగా ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. జేఎమ్ఎమ్ ఎమ్మెల్యేలు దీపక్ బిరువా, చమ్ర లిండా, రాందాస్ సోరెన్, హఫీజుల్ హసన్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాధా కృష్ణ కిషోర్, ఇర్ఫాన్ అన్సారీ, ఆర్జేడీ ఎమ్మెల్యే సంజయ్ ప్రసాద్ యాదవ్ తదితరులు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

## మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం

**- ప్రధాని మోదీ సమక్షంలో ప్రమాణ స్వీకారం - డిప్యూటీలుగా షిండే, అజిత్ పవార్ ప్రమాణం**



**ముంబై, డిసెంబర్ 5:** ముంబైలోని ఆజాద్ మైదానంలో గురువారం జరిగిన భారీ కార్యక్రమంలో దేవేంద్ర ఫడ్నవీస్ మూడోసారి మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఫడ్నవీస్ కు ఇది మూడోసారి. ఆజాద్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా శివసేన చీఫ్ ఏక్ నాథ్ షిండే, ఎన్సీపీ నేత అజిత్ పవార్ కూడా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇతర మంత్రులు ఎప్పుడు ప్రమాణ స్వీకారం చేస్తారనే ప్రశ్నకు బీజేపీ (%ఎంజూ%) నేత సుధీర్ ముంగంటివార్ సమాధానమిస్తూ.. అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందే కొత్త మంత్రివర్గం ఏర్పాటు అవుతుందన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహాయుతి కూటమిలోని పార్టీల మధ్య రెండు వారాల తీవ్ర చర్చల తర్వాత కొత్త ప్రభుత్వ ఏర్పాటు జరిగింది. ఇటీవలి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షాలైన శివసేన, ఎన్సీపీలతో కలిసి బీజేపీ నేతృత్వంలోని మహాకూటమికి 230 సీట్లు సాధించింది. బీజేపీ ఒంటరిగా 132 సీట్లు గెలుచుకుంది.మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడణవీస్ ప్రమాణ స్వీకారానికి పలువురు సినీ, రాజకీయ, వ్యాపార, క్రీడా రంగ ప్రముఖులు హాజరయ్యారు. వారిలో పలువరు కేంద్ర మంత్రులు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, బిహార్ సీఎం నితీశ్ కుమార్, పలువురు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉన్నారు. అలాగే, బాలీవుడ్ నుంచి షారూఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, సంజయ్ దత్, మాధురి దీక్షిత్, క్రికెటర్ సచిన్ టెండూల్కర్, ప్రముఖ వ్యాపారవేత్త కుమార మంగళం బిర్లా కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ సకుటుంబ సపరివారంగా హాజరయ్యారు. అలాగే, ఈ కార్యక్రమానికి సుమారు 40 వేల మంది బీజేపీ మద్దతుదారులు, మతపెద్దలు హాజరయ్యారు.

## తప్పులు చేస్తే ఉపేక్షించం

- యూపీఎస్సీతో సమానంగా టీజీపీఎస్సీ పని చేస్తుంది
- నూతన టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం
- జీపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బుర్రా

**హైదరాబాద్,డిసెంబర్ 5:** యూపీఎస్సీతో సమానంగా టీజీపీఎస్సీ పని చేస్తుందని, కమిషన్‌పై పూర్తి విశ్వాసాన్ని తిరిగి తీసుకు రావడానికి కృషి చేస్తామని నూతన టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్?గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో కమిషన్ సభ్యులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన టీజీపీఎస్సీ అభ్యర్థులను ఉద్దేశిస్తూ మాట్లాడారు. పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేస్తామని, ఎడ్యుకేషన్?లో ఉన్న సమయంలో 60 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రణాళిక బద్ధంగా ప్రతి పరీక్ష నిర్వహిస్తామని, పరీక్షలు ప్రశాంతంగా, విశ్వాస భరితంగా రాసేలా చర్యలు తీసుకుంటామని బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. అభ్యర్థులు, నిరుద్యోగులకు న్యాయం చేసేందుకు మూడున్నర ఏళ్ల సర్వీస్‌ను వదులుకుని టీజీపీఎస్సీ ఛైర్మన్?గా బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలు లేకుండా పరీక్షలు రాయాలని, టీజీపీఎస్సీలో ఉద్యోగాలు ఇప్పిస్తా మంటూ ఎవరైనా అంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## షిండే శకం ముగిసింది.. ఆయన మళ్లీ సీఎం కాలేరు

### సంజయ్‌రౌత్ కీలక వ్యాఖ్యలు

**ముంబై, డిసెంబర్ 5 :** ఏక్‌నాథ్ షిండేని బీజేపీ ఇన్ని రోజులూ ఉపయోగించుకుందని.. ఇప్పుడు మాత్రం పక్కకు నెట్టేసిందని వ్యాఖ్యానించారు. 'షిండేని బీజేపీ పావులా వాడుకుంది. ఇప్పుడు పక్కకు నెట్టేసింది. ఇక షిండే శకం ముగిసింది. ఆయన మళ్లీ ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాలేరు. ఆయన అవసరం కూడా బీజేపీకి లేదు. అవసరమైతే షిండే పార్టీని కూడా బీజేపీ విచ్ఛిన్నం చేయగలదు. ఇది ప్రధాని మోదీ రాజకీయ పంథా' అని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. మహాయుతికి స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ.. 15 రోజులైనా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయారని రౌత్ అన్నారు. అంటే వారి కూటమిలో ఏదో లోపం ఉందని అర్థమవుతోందన్నారు. అది ఇవాళ కాకపోయినా తర్వాతైనా బయటకి వస్తుందని చెప్పుకొచ్చారు. బుధవారం విధాన్ భవన్‌లో జరిగిన సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు ఫడ్నవీస్‌ను బీజేపీ ఎల్పీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫడ్నవీస్ ముఖ్యమంత్రి కానున్నారని, మహారాష్ట్రలో డబుల్ ఇంజిన్



ప్రభుత్వం ఏర్పడుతున్నట్టు బీజేపీ పరిశీలకులు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, విజయ్ రూపాని ప్రకటించారు. దీంతో ఫడ్నవీస్, ఏక్‌నాథ్ సిండే, అజిత్ పవార్ నేతృత్వంలోని మహాయుతి ప్రతినిధి బృందం బుధవారం సాయంత్రం గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరింది. గురువారం సాయంత్రం 5.30 గంటలకు దక్షిణ ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా మూడోసారి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. ఫడ్నవీస్‌తో పాటు ఉప ముఖ్యమంత్రులుగా శివసేన నేత, మాజీ సీఎం ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ నేత అజిత్ పవార్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఉప ముఖ్యమంత్రి పదవి తీసుకునేందుకు మొదట షిండే మొండికేశారు. ఆయనను డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించాల్సిందిగా బీజేపీ అధిష్ఠానం, ఫడ్నవీస్ పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఆయన స్పందించలేదు. చివరకు బుధవారం సాయంత్రం అంగీకరించిన షిండే.. ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తానని ప్రకటించారు.

# బంగ్లాదేశ్ హిందువుల కోసం కదం తొక్కిన హిందూ ఐక్యవేదిక

**కరీంనగర్ లో భారీ ర్యాలీ... కలెక్టరేట్ ఎదుట నిరసన..**

**బంగ్లాదేశ్లో హిందువులు ఏం పాపం చేశారని దాడులు చేస్తున్నారు..?**

**బంగ్లా హిందువులకు రక్షణ కల్పించాలి...**

**నిరసన కార్యక్రమం సందర్భంగాపీఠాధిపతులు, హిందూ ఐక్య వేదిక నేతల వ్యాఖ్యలు..**





**తొలి సమయం కరీంనగర్, డిసెంబర్ 4:** బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న నిరంతర దాడులను నిరసిస్తూ కరీంనగర్ హిందూ ఐక్యవేదిక బుధవారం రోజున భారీ నిరసన , ఆందోళన కార్యక్రమం చేపట్టింది. వేలాదిగా తరలివచ్చిన హిందూ జన సమూహంతో కరీంనగర్లోని గోపికృష్ణ ఫంక్షన్ హాల్ నుండి ప్రారంభించిన నిరసన ర్యాలీ పట్టణంలోని పలు ప్రాంతాల మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. ర్యాలీ సందర్భంగా బంగ్లాదేశ్ హిందువులను కాపాడండి, రక్షించండని ప్లకార్డులను ప్రదర్శిస్తూ, నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ వద్ద పీఠాధిపతులు, హిందూ ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్ లో హిందువులు ఏం పాపం చేశారని దాడులు చేస్తున్నారని ప్రశ్నించారు. బంగ్లాదేశ్ లో ప్రజాస్వామ్యం లేదని, హిందువులకు రక్షణ కల్పించమని అడిగినందుకు ఇస్కాన్ స్వామీజీ చిన్మయి కృష్ణ దాస్ ను జైల్లో వేశారని, ఆయనకు అండగా నిలిచిన వారిపై దాడులు చేస్తు మారణ హోమం సృష్టిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా బంగ్లాదేశ్ లో ఇస్లామిక్ తీవ్రవాదుల దాడులు రోజు,రోజుకీ అధికమయ్యాయన్నారు. హిందువులు, ఇతర మతపరమైన మైనార్టీలపై నిరంతరం దాడులు ,హత్యలు, దోపిడీలు, మహిళలపై అమానవీయ వేధింపులు పెరిగిపోతున్నాయని, ఇది తీవ్రమైన ఆందోళనకరమైన విషయమని, దీన్ని హిందూ ఐక్యవేదిక తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ముఖ్యంగా బంగ్లాదేశ్ హిందువులు స్వీయ రక్షణ కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో తమ గళాన్ని ఎత్తినప్పుడు , వారి గళాన్ని అణచివేయడానికి బంగ్లాదేశ్ ప్రభుత్వం దుర్మార్గ ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో బంగ్లాదేశ్ లో వరదలొస్తే ఎవరి మతం ఏంటనేది చూడకుండా అన్నం పెట్టిన ఇస్కాన్ పై బంగ్లాదేశ్ నియంత ప్రభుత్వం అణిచివేత ధోరణి అవలంబిస్తుందన్నారు. అందులో భాగంగానే ఇస్కాన్ స్వామీజీ చిన్మయి కృష్ణ దాస్ ను జైల్లో వేసి ఇబ్బంది పెడుతుందన్నారు. స్వామీజీకి అండగా నిలిచిన వారిపై ఉక్కు పాదం మోపుతుందన్నారు. ఇలాంటి చర్యలు సరికావని బంగ్లాదేశ్ ఇప్పటికైనా హిందూ మైనార్టీల పైన జరుగుతున్న దాడులను నివారించడానికి అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్ హిందువులకు విశ్వ మానవాళి అండగా నిలబడి సంఘీభావాన్ని వ్యక్తపరచడం అత్యవసరమన్నారు. బంగ్లాదేశ్ మైనారిటీ హిందువుల రక్షణ కోసం, అక్కడి ప్రజలకు అండగా నిలవడానికి, నైతిక మద్దతు అందించడానికి హిందూ ఐక్యవేదిక నిరంతర ప్రయత్నం చేస్తుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ద్వారా భారత రాష్ట్రపతికి వినతి పత్రం సమర్పించారు. ఇట్టి కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక కరీంనగర్ జిల్లా కన్వీనర్ అనుమండ్ల రాజిరెడ్డి, కో కన్వీనర్లు డా . రమణాచారి, ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, రామ్ కిరణ్, పి .కిషన్, కిరణ్ సింగ్, ఆది శ్రీనివాసరావు, పీఠాధిపతులు శ్రీశ్రీ సనక సనంద స్వామీజీ, పురాణం మహేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆమె త్యాగం వెలకట్టలేనిది

**- స్వచ్ఛమైన గోదావరి ప్రవాహం వంటిది - అందుకే ఆమె మరణించినా - జీవితకాలం బతికి ఉండిపోతారు**

**- శరీర దాత వీరగోని లక్ష్మి సంస్మరణ సభలో వక్తలు**

**- భర్త పెంటయ్య మరియు కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపిన - వివిధ రంగాల ప్రముఖులు**





**తొలి సమయం కరీంనగర్, డిసెంబర్ 4:** బతుకు..అందరినీ బతకనివ్వు అనే సందేశాన్ని స్వర్గీయ వీరగోని లక్ష్మి సమాజానికి అందించిందని వక్తలు అభిప్రాయపడ్డారు. మనిషి జీవితం, నడవడిక పుస్తకాలు నేర్పితే వచ్చేవి కావన్నారు. వీరగోని లక్ష్మి త్యాగం,సంఘర్షణ వెలకట్టలేనివని కొనియాడారు. బుధవారం కరీంనగర్ భగత్ నగర్ లోని బృందావన్ గార్డెన్స్ లో జరిగిన శరీర దాత వీరగోని లక్ష్మి సంస్మరణ సభకు కవులు, రచయితలు,ఉద్యోగులు,ఉపాధ్యాయులు, రాజకీయ వేత్తలు,పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పది రోజుల క్రితం ఉపాధ్యాయ సంఘం నాయకులు, రిటైర్డ్ ఎంఈఓ వీరగోని పెంటయ్య సతీమణి లక్ష్మి అనారోగ్యంతో మరణించగా ఆమె ఆశయం మేరకు కుటుంబ సభ్యులు పార్థివ దేహాన్ని చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీకి సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. కుటుంబ సభ్యులు, సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సంస్మరణ సభ నిర్వహించగా, ఇందులో పాల్గొన్న వ్యక్తులు మాట్లాడుతూ లక్ష్మి జీవించి ఉన్నప్పుడే కాదు, మరణించిన తరువాత కూడా సమాజానికి సందేశం ఇస్తూ పోయిందన్నారు. ఆమెను మానవీయ మహిళగా అభివర్ణించారు. మొద్దు బారిన హృదయాలున్న సమాజంలో మనం జీవిస్తున్నామని, అలాంటి సమాజంలో స్వచ్ఛమైన గోదావరి ప్రవాహం వలె లక్ష్మి ముందుకు సాగిందన్నారు. ప్రపంచ స్పృహ,లౌక్యం తెలిసిన వ్యక్తిగా ఆమెను కొనియాడారు. తాను చదువుకోకపోయినా.. సంఘర్షణలను తట్టుకొని నిలబడగలిగారని, మరణించేంతవరకు సాటివారిపై ప్రేమను కురిపిస్తూనే వచ్చారని చెప్పారు. అందుకే ఆమె చనిపోయినా, జీవితకాలం బతికి ఉండిపోతారని తెలిపారు.ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన కల్పించారు.శరీర దానం చేసిన సందర్భంగా లక్ష్మి భర్త వీరగోని పెంటయ్య,వారి కుమారులు సురేష్ మానస, నరేష్ -కృష్ణవేణి,కూతుర్లు అల్లుండ్లు సమత-తిరుపతి సౌజన్య-శ్రీనివాస్ లకు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, సలహాదారులు తాడూరు కరుణాకర్, కరీంనగర్ పట్టణ కన్వీనర్ యస్.రాజకనకయ్య జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ సునీల్ రావ్, బిజెపి నేత చల్ల నారాయణరెడ్డి, కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పురుమల్ల శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘం నాయకులు రఘు శంకర్ రెడ్డి, కోల.రాజమల్లు, నారాయణరెడ్డి, ప్రముఖ కథా రచయిత అల్లం రాజయ్య, కవి అన్నవరం దేవేందర్, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర బాబు, రిటైర్డ్ ప్రిన్సిపల్ జి నాగేందర్, స్వర్గీయ ఆకుల భూమయ్య కుమార్తె ఆకుల కవిత, తదితరులు శరీర దాత లక్ష్మితో తమకు ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. తొలుత ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు.

# జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన నేషనల్ అచీవ్మెంట్ సర్వే





**తొలి సమయం మహబూబాబాద్ డిసెంబర్ 5:** దేశవ్యాప్తంగా విద్యార్థుల అభ్యసన ఫలితాలు అభ్యసన స్థాయిలు ఏ విధంగా ఉన్నాయి తెలుసుకోవడం కోసం చేపట్టిన నాస్ సర్వే జిల్లాలో రాండమైజేషన్లో ఎంపిక కాబడ్డ 73 పాఠశాలలు 88 తరగతులు(3,6%ు%9) ఏ రకమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దిగ్విజయంగా పూర్తి చేయడం జరిగింది అని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తొలిమెట్టు మరియు ఉన్నతి కార్యక్రమాల ఆధారంగా విద్యార్థుల యొక్క అభ్యసన ఫలితాలు మెరుగుపరచడం కోసం 2021 నుండి తీవ్రమైన కృషిచేసి మూడు మాక్ టెస్ట్ లు నిర్వాహనతోపాటు ఎస్సీఈఆర్టీ పరాక్ పేపర్ ను విద్యార్థులతో సాధన చేయించడం జరిగింది గతంలో జరిగినటువంటి పరీక్షలో విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలన్నింటిని అధిగమించడం కోసం ఎస్ సి ఆర్ టి వారు ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక నిర్వహించి అన్ని పాఠశాలల్లో మెరుగైన ఫలితాల కోసం అహర్నిశలు పాటుపడ్డారనీ తెలిపారు. నాస్ సర్వే నిర్వహణలో భాగంగా డిస్టిక్ లెవెల్ కోఆర్డినేటర్ బాలాజీ గారు మరియు అసిస్టెంట్ డిస్టిక్ లెవెల్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ఆజాద్ జెండర్ ఈక్వాలిటీ కోఆర్డినేటర్ విజయకుమారి అదే విధంగా సదయ్య, మహేష్ డి ఎల్ ఎం టి పలు పాఠశాలను సందర్శించి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా 132 ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు సర్వే నిర్వహించేటప్పుడు ఏవైనా సమస్యలు ఆటంకాలు ఏర్పడ్డ ఒక వార్ రూమ్ ఏర్పాటు చేసి త్వరితగతిన ఆ సమస్యలకు సమాధానాలు అందించే విధంగా పరీక్ష సజావుగా సాధే విధంగా ప్రణాళిక సిద్ధం చేయడం జరిగింది. ఈ సర్వే నిర్వహించడం కోసం ప్రత్యేకంగా సీబీఎస్ఈ నుండి ప్రతి పాఠశాలకు ఒక అబ్జర్వర్ని 73 మందిని కేటాయించడం జరిగింది. సర్వే అంతా కూడా వారి పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది. ఈ సర్వేలో పాల్గొన్న విద్యార్థుల సంఖ్య 2226 కాగా ఉపాధ్యాయులు 286 ప్రధానోపాధ్యాయులు 73 పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో నష్టపోతున్న
# రైతులను ఆదుకోవాలి



**తొలి సమయం మహబూబాబాద్ డిసెంబర్ 5 :** జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకోవాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ జిల్లా వ్యాప్తంగా అనేక మండలాలలో కురుస్తున్న అకాల వర్షాల వల్ల రైతాంగానికి అపార నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ మండలాలలో రైతాంగానికి ప్రధాన పంటగా ఉన్న మొక్కజొన్నలు తడిసి రంగు మారుతున్నాయని రైతాంగం తీవ్ర మనోవేదనతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. .రంగు మారిన మొక్కజొన్న వరి ధాన్యాన్ని ప్రభుత్వం సరైన రేటుకు కొనుగోలు చేయాలని కోరారు. జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు అడిగాపులు పడుతున్నారని %ఎ%సకాలంలో తూకాలు జరపకపోయే వరకు వర్షాలతో పంట తడుస్తుందని అన్నారు. ప్రభుత్వ అధికారులు యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు, తూకాలు, రవాణా పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వర్షానికి తడిసిన మొక్కజొన్నలను వరి ధాన్యాన్ని పత్తి ఇతర పంటలను దళారీలు తేమ కారణం చూపి చాలా తక్కువ రేటుకు రైతులు వద్ద కొనే ప్రమాదం ఉందని దీనిపై అధికారులు నిఘా పెట్టాలని చంద్రన్న సూచించారు.కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు టార్పల్స్ మంచినీరు నీడ ఇతర కనీస సౌకర్యాలను కల్పించాలని ఆయన కోరారు.సన్నధాన్యంతో పాటు దొడ్డు రకం ధాన్యానికి కూడా బోనస్ క్వింటాలకు 500 చెల్లించాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరిచిపోయి విజయోత్సవాలను గొప్పగా జరుపుకోవడం సిగ్గుచేటని ఆయన అన్నారు.ఇప్పటికైనా స్పందించి హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోతే ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి పైండ్ల యాకయ్య,జిల్లా సహాయ కార్యదర్శి పాపారావు జిల్లా నాయకులు ఊడుగుల రాములు,వెంకటయ్య తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ఎఫ్ఐఆర్ లో ఏ1గా
# జగన్ రెడ్డి ఉండాల్సింది

**కాకినాడ పోర్టు**

**వ్యవహారంలో ఆనం వెంకటరమణారెడ్డి**

**అమరావతి, డిసెంబర్ 5:** కేవీ రావు గొంతు మీద కత్తి పెట్టి రూ. 2 వేల కోట్ల విలువైన కాకినాడ సెజ్ భూములను రూ.12 కోట్లకు, కాకినాడ సీ పోర్టులో రూ. 2,689 కోట్ల విలువైన షేర్లను రూ. 494 కోట్లకే కొట్టేసిన వైసీపీ దోపిడీ ముఠా... వారి వెనుక ఉన్న జగన్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేసి విచారించాలని... వాస్తవాలను బయటపెట్టాలని... ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ రెడ్డి జేబుదొంగ అని అనాడే చెప్పాం. మా మాట నాడు ఎవరూ నమ్మలేదు. నేడు ఏకంగా సీఐడీ ఛార్జ్ షీట్ ఓపెన్ చేసింది. కాకినాడ సెజ్ విస్తీర్ణం 8,320 ఎకరాల్లో ఉంది. ఈ సెజ్ పై జగన్ రెడ్డి కళ్లు పడ్డాయి. వైవీ సుబ్బారెడ్డి కొడుకు విక్రాంత్ రెడ్డి, లిక్కర్ స్కాంలో జైల్లో ఉండి వచ్చిన శరత్ రెడ్డి, విజయసాయిరెడ్డిలతో కలిసి బెదిరింపులకు దిగారు. దీంతో కేవీ రావు ఫిర్యాదుపై వారి పేర్లను ఛార్జ్ షీట్ లో పెట్టారు. కత్తులు, గన్నులు పెట్టి నాడు షేర్లు, భూములు కొట్టేసేందుకు కేవీరావును బెదిరించారు. కాకినాడ డీప్ సీ పోర్టును కైవసం చేసుకోవడానికి... శ్రీకాంత్ రెడ్డి, శరత్ రెడ్డిని జగన్ రెడ్డి రంగంలోను దింపి పీకేఎఫ్ శ్రీధరన్ సంతానం అనే ఆడిట్ సంస్థ, క్రోల్ ఇండియా అనే ఆడిట్ సంస్థలతో 28 రోజులు అక్రమ ఆడిట్ చేయించి.. ప్రభుత్వానికి రూ. 1000 కోట్లు కట్టాలని కేవీ రావును బెదిరించారు. ఒకే కంపెనీని ఇద్దరు కన్సెల్టెంట్లతో ఆడిట్ చేసి ఒత్తిడి తెచ్చారు. రూ. 1000 కోట్లు కట్టకుంటే కేసులు పెడతామని బెదిరించి సీ పోర్టులో వాటాల బదిలీకి డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోర్టును స్వాధీనం చేసుకుంటామని భయపెట్టారు. షిప్పింగ్ ఏజెంట్ లను కూడా భయపెట్టారు. చివరకు కేవీ రావు గొంతు మీద కత్తి పెట్టి 41% శాతం వాటాను కొట్టేశారు. అసలు చెన్నై నుండి ఆడిటర్లు ఇక్కడకు వచ్చి ఆడిట్ చేయడం ఏంటి? ఏపీలో ఆడిటర్ లు లేరా? ప్రభుత్వం ఆడిట్ చేయవచ్చు కదా? ఈ కేసులో ఎఫ్ఐఆర్ లో ఏ1 గా ఉండాల్సింది విక్రాంత్ రెడ్డి కాదు... జగన్ రెడ్డి. కర్త కర్మ క్రియ అన్ని కూడా జగన్ రెడ్డినే. డీజీపీ, సీఐడీ దీన్ని గుర్తించి జగన్ రెడ్డిని ఏ1 గా నమోదు చేయాలి... అని ఆనం వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు.

# బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండించాలి

**హిందూ చైతన్యమే భారత చైతన్యం,మరియు భారత సంక్షేమం**

**బంగ్లాదేశ్ లో పాకిస్తాన్, చైనా, మరియు ఉగ్రవాద ముస్లిం ప్రేరేపిత దాడులే అనేది అని అర్థం చేసుకోవాలి..**

**దేశంలోని దారుణాలు మారణహోమాలను నిరసిస్తూ చేసే క్రొవ్వొత్తుల ర్యాలీలు. హిందువులపై దాడులు చేస్తే ఏమయ్యాయి?**




**తొలి సమయం ప్రధాన ప్రతినిధి మహబూబాబాద్ డిసెంబర్ 4:**
మనదేశంలో మైనారిటీలుగా ఉన్న మతాలకు హక్కులు రిజర్వేషన్లు ఉంటాయి కానీ బంగ్లాదేశ్ లో ఉన్నటువంటి మైనారిటీ హిందువులకు మాత్రం హక్కులు ఉండవు పైగా పాకిస్తాన్ మరియు చైనా, ఉగ్రవాద ముస్లిం ప్రేరేపిత దాడులు జరగడం దారుణమని ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ పింగిలి శ్రీనివాస్ నిప్పులు చెరిగారు .. బంగ్లాదేశ్ హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ హిందూ పోరాట ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంగ్లా దేశ్ లో హిందువుల పై జరిగే దాడులను కండిస్తూ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు.. ఈ ర్యాలీ ప్రధాన వీదుల్లో జరిగింది జిల్లా కోర్టు సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించారు.. సెంటర్ కోర్టు సెంటర్ అంబేద్కర్ విగ్రహం ముందు జిల్లా ఆర్ఎస్ఎస్ కార్య వాహ్ పింగిలి శ్రీనివాస్ మాట్లాడుతూ... భారతదేశంలో మహిళలపై, విద్యార్థినీలపై ఇంకా ఇతరేతర అమానవీయ దారుణాలు చోటు చేసుకున్నప్పుడు దేశం మొత్తంగా కొవ్వొత్తుల ర్యాలీ తీస్తూ నిరసనలు వ్యక్తం చేసే ఆచారం ఉంటుందని.. కానీ బంగ్లాదేశ్ లో హిందువులపై సుమారు 2000దాడులు జరిగాయని ఆ దాడులను ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీలు ఎందుకు తీయడంలో ముందుకు రాకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు.. మనదేశంలో మెజారిటీగా ఉన్న హిందువులకు హక్కులు ఉండవు, కానీ ఇక్కడ మైనారిటీ మతాలకు హక్కులు ఉంటాయి.. బంగ్లాదేశ్ లో ఉన్న మైనార్టీలుగా ఉన్న హిందువులకు హక్కులు ఉండకపోయినా పర్వాలేదు కానీ రెండు వేల సార్లు దాడులు జరిగాయని, ఎందుకు ఈ వివక్ష అని ప్రశ్నించారు. ఇతర మతాలను హిందువులు గౌరవిస్తున్నప్పుడు తిరిగి వాళ్లు కూడా హిందువులకు అంతే స్థాయిలో గౌరవం ఇవ్వకుండా ద్వంద ప్రమాణాలతో వివక్షను చూపెట్టడం దారుణం అని అన్నారు.. సుమారు 2000 దాడులు బంగ్లాదేశ్ లో జరగడం యావత్ సమాజం గమనిస్తుందని అన్నారు.. ఈ దాడుల్ని భారత సమాజం ఖండించాలని పిలుపునిచ్చారు. హిందూ సమాజం ఒక్కతాటిపై నిలబడకుండా అర్థం కాని అంతర్గత కుట్రలను తెలుసుకోవాలని హితవు పలికారు.. హిందూ చైతన్యమే భారత చైతన్యమని అదే భారత సంక్షేమం అని అన్నారు.. ప్రక్క దేశమైన భారత బంగ్లాదేశ్ బాగుండాలని కోరుకుంటున్నామని అన్నారు బంగ్లాదేశ్ లో హిందువులపై జరిగే దాడులను భారత దేశ హిందూ సమాజ హస్తిత్వంపై జరిగే దాడులుగా భావించాలని అన్నారు.. అనివార్యంగా హిందువులంతా ఒక్కటి కాకుంటే నష్టపోతామని అన్నారు రిజర్వేషన్ విద్యార్థి ఉద్యమాలు రూపాంతరం చెంది హిందువులపై దారుణంగా జరిగే దాడులుగా పరిణామం చెందడం అన్యాయం అని అన్నారు.. ఈ కార్యక్రమంలో దార ఇందు భారతి. ఎలమంచిలి వెంకటేశ్వరరావు. మోసంగి మురళి. క్యాచ్ వల్ శ్యాంసుందర్ శర్మ, ఆకుల శ్రీనివాస్. పొన్నం మాల్సాని. ఓం నారాయణ లోయ. శ్రీరంగం మురళి భువనగిరి సుందర్ గుప్తా, సునీల్ పాట్ని గోపాల్ గిలాడా, జయప్రకాశ్ లోయ శర్వాన్ సూర్య ప్రకాష్ తదితరులు 100 మంది పాల్గొన్నారు



# డుబుల్ ఇంజన్ సర్కార్ రావాలి

**• లగచర్ల పై కెటిఆర్ నీతులు • నేరెళ్ల ఘటన మరిచావా!కేటీఆర్. • ప్రతి శాఖలో లంచాలతో నడుస్తోంది**
**• బిజెపి జిల్లా అధ్యక్షులు ఎలమంచిలి వెంకటేశ్వరరావు**



**తొలి సమయం ప్రధాన ప్రతినిధి మహబూబాబాద్ డిసెంబర్ 5:**
పాలకులు మారినా, పాలన విధానంలో మార్పు రాకపోగా.. ప్రతి శాఖలో లంచాలతో అవినీతి కంపు కొడుతుందని బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షులు ఎలమంచిలి వెంకటేశ్వరరావు అన్నారు.. 6 గ్యారంటీలు 66 అబద్ధాలు, మోసాలు, కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన వైపాల్య ల పై జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఇందు భారతి అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో సెంటర్లో బహిరంగ సభ జరిగింది ఈ సభలో బిజెపి జిల్లా అధ్యక్షులు ఎలమంచిలి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... లగచర్ల గిరిజన రైతులపై ప్రభుత్వం దౌర్జన్యం చేస్తూందంటూ మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడడం విడ్డూరంగా ఉంది అన్నారు.. నేరెళ్లలో సాండ్ మాఫియా దౌర్జన్యాలు, పోలీసులచే చిత్రహింసలు పెట్టగా ఇప్పటికీ పోలీసుల దెబ్బలకు కోలుకోలేని నేరెళ్ల బాధితుల గురించి మరిచావా? అన్నారు. రైతు భరోసా రెండు లక్షల రుణమాఫీ, రైతుబంధును అంబేద్కర్ బంద్ గా మార్చడం.. పెళ్లయిన ఆడపిల్లలకు తులం బంగారం లక్ష రూపాయలు నగతు అన్నింటినీ అటకెక్కించారని ఎ ద్దేవాల్ చేశారు జిల్లాలో పోలీసు రెవెన్యూ శాఖల తీరు పై నిప్పులు చేరిగారు, గత ఎమ్మెల్యే శంకర్ నాయక్ భూకబ్జాలు అవినీతి బాగోతాల చిట్టా విప్పుతాను అన్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మురళి నాయక్ ఒక్క అడుగు ముందుకు వేయలేదని ఒక్క గజం జాగ రికవరీ చేయలేదని అన్నారు.. జిల్లాలో ఏ ఒక్క శాఖ నిజాయితీగా పనిచేయడం లేదని అన్నారు.. లంచం తీసుకోకుండా బిజెపికి ఓటు వేయండి అని అన్నారు.. నీతివంతమైన పార్టీ బిజెపి మాత్రమే అని.. డబుల్ ఇంజన్ సర్కారుతో మాత్రమే అభవృద్ధి జరుగుతుందని అన్నారు.. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ బిజెపి జిల్లా అధ్యక్షులు యాప సీతయ్య.. జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు నేరేటి సురేందర్ మాట్లాడుతూ.. మానుకోట ఎమ్మెల్యే ఎటు పోతున్నాడు ఏమి చేస్తున్నాడు అంతా అయోమయం గందరగోళంగా ఉంది అని ఎద్దేవా చేశారు.. మెడికల్ కాలేజీలో ఆన్లైన్ ద్వారా పాఠాలు వినే పరిస్థితికి దిగజారింది అన్నారు ప్రత్యేక రాష్ట్రం పాలన ప్రారంభంలో లక్ష రూపాయల బడ్జెట్ కలిగి ఉన్నదని, అంత ధనవంతమైన రాష్ట్రాన్ని 90 వేల కోట్ల అప్పులకుప్పలు చేసాడని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పాలన విధానాన్ని అవలంబిస్తుందని అన్నారు. గూడూరు లో ఏకలవ్య స్కూలుకు భవన నిర్మాణం జరుగలేదన్నారు.. కేంద్రీయ విద్యాలయం నిర్వహణ నత్త నడక నడుస్తుందని ఇంతవరకు నూతన భవన నిర్మాణం జరగలేదని అన్నారు. పాము పిల్లల్ని తిన్నట్లు సొంత సామాజిక వర్గాన్ని తింటున్నారని గిరిజన ప్రతినిధులను ఎండగట్టారు. చివరి వ్యక్తికి అభివృద్ధి పలాలు అందే విధంగా బిజెపి పని చేస్తుందని, దేశానికి బిజెపి శరణ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ శశిధర్ రెడ్డి. జిల్లా రూరల్ బిజెపి అధ్యక్షులు మారగాని రాజు గౌడ్ మలేష్ యాదవ్. సుమారు బహిరంగ సభలో 150 మంది బిజెపి కార్యకర్తలు శ్రేణులు పాల్గొన్నారు

# ఇసుక తోడేస్తున్నారు

**-పోతుగల్లు గ్రామంలో జోరుగా కొనసాగుతున్న ఇసుక అక్రమ దందా**

**-ఇసుక అక్రమ దందాకు అడ్డుకట్ట వేసేదెవరూ..?**

**-ఇసుక అక్రమ దందాను అరికట్టకపోతే..భూగర్భ జలాలు అడుగంటుకుపోయి..రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లుతుంది**

**-సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్**



**తొలి సమయం భూపాలపల్లి డిసెంబర్ 5**
మొగుళ్లపల్లి మండలం చుట్టూ ఉన్న వాగులలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇస్మాసురులు..ఇసుకను తోడేళ్లుగా తోడేస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని రంగాపురం, ఇస్సిపేట, మేదరమట్ల, అంకుషాపురం, ములకలపల్లి, మొగుళ్ళపల్లి, బంగ్లాపల్లి, వేములపల్లి, పోతుగల్లు గ్రామాల సమీపంలో గల వాగుల నుండి ఇసుక అక్రమ రవాణా దందా యథెచ్చగా కొనసాగుతుంది. చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల ట్రాక్టర్ యజమానులు ఒక ముఠాగా ఏర్పడి ఈ దందాను కొనసాగిస్తున్నట్లు సమాచారం. రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా ఈ ఇసుక దందా కొనసాగుతుంటే..కొందరు వ్యక్తులు ఈ ఇసుక దందాకు పైలట్ గా వ్యవహరిస్తూ..ఇసుక దందా ముఠాకు అధికారుల సమాచారాన్ని చేరవేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా పోతుగల్లు గ్రామ సమీపంలో గల వాగులో విచ్చలవిడిగా ఇసుకను అక్రమంగా పట్టణ ప్రాంతాలకు తరలిస్తూ..సహజ వనరులను లూటీ చేస్తూ..ప్రభుత్వ ఆదాయాన్ని గండీ కొడుతున్న ఈ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, ఇసుక దందా ముఠాకు సహకరించే వారిని గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఒక ప్రక్క వాగులు ఎండిపోతున్న తరుణంలో..వాగుల చుట్టు పక్కల ఉన్న రైతులు వానకాలం పంటలు పూర్తి చేసుకుని వేసంగి పంటలకు సిద్ధమవుతున్న తరుణంలో..ఈ ఇసుకను తోడేస్తున్న ఇస్మాసురుల వలన భూగర్భ జలాలు అడుగంటుకుపోయి రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున..రైతుల క్షేమం కోరి భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు స్పందించాలని ఈ సందర్భంగా మల్లేష్ ఆయనకు సూచించారు.

## ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా
# పనిచేస్తున్న ముఖ్యమంత్రి

**గ్రామీణ క్రీడలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్న ప్రభుత్వం**

**మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్**



**తొలి సమయం మహబూబాబాద్ డిసెంబర్ 5 :**
గురువారం ముఖ్యమంత్రి ఛాంపియన్షిప్, ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు, 5 కే రన్ , తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి, ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు జిల్లా ఇన్చార్జి, బండి సుధాకర్ గౌడ్, ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, హాజరై జెండా ఊపి ప్రారంభించి రన్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆరోగ్యంగా ఉండాలి అంటే అందరూ వ్యాయామం, వాకింగ్, రన్నింగ్, యోగ, చేయాలని, అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ క్రీడలకు క్రీడాకారులకు సంస్కృతికి సాంప్రదాయాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ఉన్నారనీ చెప్పారు. పట్టణంలోని జూనియర్ కాలేజ్ మైదానంలో పట్టణ పుర ప్రముఖులు, వాకర్స్, ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, రన్ లో పాల్గొన్న సభ్యులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు 2024 పురస్కరించుకొని ముఖ్యమంత్రి ఛాంపియన్షిప్ క్రీడా కప్ రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు రన్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు,బండి సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ బాగుండాలి అనే ఉద్దేశంతో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం ముఖ్యమంత్రి చేపడుతుందని అన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంత యువతి, యువకులు ఉన్నత చదువుల తోపాటు క్రీడలపై ఆసక్తి కనబరచాలన్నారు. ఈ 5కే రన్ లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బిఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడం సిగ్గు చేటు

**ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు**



**తొలి సమయం,హబూబాబాద్ డిసెంబర్ 5:**
కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన పేరుతో విజయోత్సవాలు చేసుకుంటూ టిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు అన్నారు.. ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావుక్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ.. టిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడంపై ఖండిస్తూ నిప్పులు చెరిగారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చే ప్రక్రియ ను మార్చుకో.లేదంటే తల్లి ప్రతాపం త్వరలోనే చూస్తావు.అన్నారు తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి తెలంగాణ రాష్ట్రాన్ని ఆంధ్ర ప్రజలకు అమ్ముతావా! అని ప్రశ్నించారు. తెలంగాణ చరిత్రను నువ్వు మార్చలేవు అన్నారు చరిత్ర లో నీ లాంటి పాలకులు ఎందరో మట్టి కరిచారు అన్నారు మాజీ మంత్రి న హరీష్ రావు ను అరెస్ట్ చేయడము అప్రజాస్వామికం అన్నారు. తెలంగాణ ప్రజలు మొత్తం నీ పాలన చూసి సిగ్గు పడుతున్నారు అన్నారు.రుణమాఫీ మొత్తం చేయకుండా రైతులను మోసం చేసిన గొప్ప పాలకుడవు నీవు అని సి ఏం రేవంత్ రెడ్డి ని అన్నారు.ఒక్క హామీ అయినా నిజాయితీగా అమలుపరిచవా అన్నారు. తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి అండగా ఉన్నారు.. అన్నారు. లగచర్ల లాంటి పోరాటాలు ప్రజల తరుపున చేసిన ఎంతో చరిత్ర ఉన్న పార్టీ బి ఆర్ ఎస్ పార్టీ. అన్నారు. అరెస్టులు, కేసులు బిఆర్ఎస్ పార్టీకి కొత్త కాదు అన్నారు అరెస్టు చేసిన బిఆర్ ఎస్ నేతలను వెంటనే విడుదల చేయాలి.లేదంటే రాష్ట్రం అగ్నిగుండం అవుతుంది.అని హెచ్చరిక చేశారు. పనికి మాలిన ముఖ్యమంత్రి వద్దు అంటూ కాంగ్రెస్ నేతలే చర్చలు చేస్తున్నారు అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెంకన్న. టిఆర్ఎస్ నాయకులు మంగళంపల్లి కన్న, విద్యార్థి ఉద్యమ నాయకులు భానోత్ రవికుమార్. వెంకన్న తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాలనను ప్రశ్నిస్తే జైలుకా..?

**ఎక్స్ వేదికగా కేటీఆర్ ఫైర్**

**హైదరాబాద్,డిసెంబర్ 5:** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పాడి కౌశిక్ రెడ్డి, జగదీశ్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి, ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ అరెస్టులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా రేవంత్ సర్కార్‌పై ధ్వజమెత్తారు. ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులు..! పార్టీ హామీలపై నిలదీస్తే అరెస్టులు..! చేస్తున్నారంటూ కేటీఆర్ మండిపడ్డారు.

## ఏపీ ప్రభుత్వంతో గూగుల్
# మధ్య కీలక ఒప్పందం

**మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఒప్పందాలు**

**టెక్నాలజీ అందిపుచ్చుకోవడంలో ఏపీ ముందుడుగు**

**ఈజ్ ఆఫ్ లివింగ్ మా ప్రభుత్వ లక్ష్యం**

**మంత్రి నారా లోకేశ్ వెల్లడి**

**అమరావతి, డిసెంబర్ 5:** ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ రంగంలో అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకమైన తొలి అడుగు వేసింది. ఏఐ రంగంలో అధునాతన ఆవిష్కరణల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ సంస్థ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టిజీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో గూగుల్ మ్యాప్స్ ఇండియా జనరల్ మేనేజర్ లలితా రమణి, ఏపీ రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) శాఖ కార్యదర్శి సురేష్ కుమార్ సచివాలయంలో ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... ఈజ్ ఆఫ్ లివింగ్ తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. దైనందిన జీవితంలో ప్రజలు తమకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లు, సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారికి అందుబాటులో ఉండే సెల్ ఫోన్ వంటి సాధనం ద్వారా ఆయా సేవలను అందుబాటులోకి తేవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. యువతకు ఏఐ ఆధారిత భవిష్యత్ అవకాశాలను కల్పించేందుకు గూగుల్ సంస్థ ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని తెలిపారు. గూగుల్ తో తాము చేసుకున్న ఒప్పందం ద్వారా ఏఐ రంగంలో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోవడంతోపాటు యువతకు అంతర్జాతీయస్థాయి నైపుణ్య శిక్షణ లభిస్తుందని, తద్వారా అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. పరిపాలన వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ను ఉపయోగించడం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందించాలన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనా విధానానికి అనుగుణంగా ఈ ఒప్పందం చేసుకుంటున్నామని గూగుల్ మ్యాప్స్ జనరల్ మేనేజర్ లలితా రమణి తెలిపారు. తాము ఏపీ ప్రభుత్వంతో కలిసి చేపట్టే కార్యక్రమాలు భవిష్యత్తు ఏఐ ఆధారిత సేవల్లో సాధికారిత సాధించడానికి ఆలంబనగా నిలుస్తాయని అన్నారు. ఏఐ ద్వారా సమాజానికి సానుకూల ప్రయోజనాలను పెంచడానికి కట్టుబడి ఉంది.

## విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా
# సీనియర్ ఐఏఎస్ ఎన్.శ్రీధర్

**హైదరాబాద్,డిసెంబర్ 5:**
విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ ఎన్.శ్రీధర్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయనకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీచేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన కొనసాగుతారని పేర్కొన్నారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న బుర్రా వెంకటేశంను ప్రభుత్వం టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన వాలంటరీ రిటైర్‌మెంట్‌కు ప్రభుత్వం అనుమతించింది. ఈ నేపథ్యంలో వెంకటేశం స్థానంలో ఎన్.శ్రీధర్‌కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. శ్రీధర్ 1997 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఆయన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు క్యాడర్లలో సేవలందించారు. మొదట రాజమండ్రి సబ్ కలెక్టర్‌గా, ఊట్నూరు ఐటీడీఏ పీఓగా, పోర్ట్స్ డైరెక్టర్‌గా కాకినాడలో పని చేశారు. అనంతరం అనంతపురం, కృష్ణ, వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో కలెక్టర్‌గా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయంలో స్పెషల్ సెక్రెటరీగా మూడేళ్ల మూడు నెలల పాటు పని చేశారు.

## తక్కువ ధరకే అమ్ముకొని
# రైతులు మోసపోవద్దు

**ప్రతి గింజ ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది**

**మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, పార్థసారథి వెల్లడి**

**అమరావతి, డిసెంబర్ 5:** జిల్లాలోని వేమూరు నియోజకవర్గంలో మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, పార్థసారథి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రులు పరిశీలించారు. అనంతరం మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. ధాన్యం తేమ శాతం 17% నుంచి 25% వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. బయట తక్కువ ధరకే అమ్ముకొని రైతులు మోసపోవద్దన్నారు. రైతుల దగ్గర్నుంచి ప్రతి గింజ ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. మిల్లర్లు ఎవరైనా సరే తేమ శాతం ఎక్కువ ఉందని రైతులను ఇబ్బంది పెడితే రైస్ మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. రైతు భరోసా కేంద్రాల్లో వారితో పాటు మిల్లర్లు కూడా ఒకళ్ళు అందుబాటులో ఉండాలన్నారు. తేమశాతం పరిశీలించి ఫైనల్ చేయాలని సూచించారు. గత వైసీపీ హయాంలో ధాన్యం కొనుగోలు చేసిన ఆరు ఏడు నెలలకు గాని డబ్బులు రైతులు ఎకౌంట్లో పడేవి కాదని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 24 గంటల్లో రైతుల అకౌంట్లో డబ్బులు వస్తున్నామని మంత్రి పార్థసారథి వెల్లడించారు. వర్షాలకు రైతులు కొంతమంది ఇబ్బంది పడ్డారని ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు అన్నారు. కూటమి ప్రభుత్వం హయంలో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా పంట కొనుగోలు చేస్తున్నామన్నారు. మిల్లర్లు అవకతవకలు చేస్తే అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. రైతులెవరు నష్టపోవద్దని.. ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. గతంలో ధాన్యం కొనుగోలు చేసిన ఆరు ఏడు నెలలకు కూడా డబ్బులు పడతాయో లేదో తెలిసేది కాదన్నారు. వైసీపీ పార్టీ నాయకులు బ్రోకర్లు అవతారమెత్తి రైతులను మోసం చేశారని నక్కా ఆనంద్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ పదే పదే ఎందుకు విఫలమవుతోంది?

**హైదరాబాద్, డిసెంబర్ 5:** సార్వత్రిక ఎన్నికల్లో వంద స్థానాలు గెలిచి ఉత్తరాధిలో కొద్దిగా పుంజుకున్నట్టు కనిపించిన కాంగ్రెస్ కు మళ్లీ దెబ్బ మీద దెబ్బ. ఎంత బలంగా జనంలోకి వెళ్లినా బీజేపీ ముందు నిలువ లేకపోతోంది. ఆ పార్టీ విజయ పరంపరను అడ్డుకోవటంలో ఘోరంగా విఫలమవుతోంది. గెలిచిన రాష్ట్రాల్లోనే బీజేపీ మళ్లీ మళ్లీ గెలుస్తోంది. పైగా, గతంలో కంటే ఎక్కువ సీట్లు, ఓట్లు సాధిస్తోంది? ఇటీవలి హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఇందుకు మంచి ఉదాహరణలు. అంతకు ముందు మధ్యప్రదేశ్. కాంగ్రెస్ గెలుస్తుంది అనుకున్న చోటల్లా ఓటమి పాలవుతోంది. ఎక్కడ పొరపాటు జరుగుతోంది? కాంగ్రెస్ ఎప్పటికైనా అధికారం చేజిక్కించుకోగలదా? కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తాజా సమావేశంలో పాల్గొన్నఅందరిలోనూ ఈ ప్రశ్నలే. వారు సాధారణ నేతలు కాదు. ఎంతో అనుభవం ఉన్నవారు. అయినా ఈ వరుస ఓటములకు కారణాలేమిటో వారు నిర్దిష్టంగా చెప్పలేకపోయారు. నాలుగున్నర గంటల పాటు జరిగిన చర్చను చివరకు మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై మరో కమిటీని వేయాలని నిర్ణయించి ముగించారు. ఇది చాలా రొటీన్ గా జరిగేదే. గతంలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హర్యానా ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ ఇలాంటి అంతర్గత కమిటీలను నియమించింది. ఈ కమిటీల వల్ల ఏమి జరుగుతుందుతో ఎవరికీ తెలియదు. మరోవైపు, బీజేపీ ఎప్పటికప్పుడు కొత్త ఎత్తుగడలతో ఎన్నికలు సదా సిద్ధంగా ఉంటుంది. మహారాష్ట్ర ప్రయోగాన్ని దేశమంతటా అమలు చేసేందుకు బీజేపీ ఇప్పటి నుంచే సిద్ధమవుతోంది. కానీ కాంగ్రెస్ పార్టీలో ఈ కసి ఏ కోశానా కని పించదు. కనీసం ఒక ఏడాది ముందైనా మనం ఎన్నికలకు సంసిద్ధం కావాలని అర్థం అవుతోందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జులన ఖర్గే వర్కింగ్ కమిటీ సమావేశంలో అన్నారు. మోడీ ఒక ఎన్నికల ఫలితాలు రాకముందే మరో ఎన్నికలకు సిద్ధమయి ఉంటారని కాంగ్రెస్ నేతలు ఇంకా గ్రహించలేదనే విషయం ఖర్గే మాటల ద్వారా స్పష్టమవుతోంది. భారతీయ జనతా పార్టీ వద్ద ఎప్పుడూ ఒకటికి మించిన వ్యూహాలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి. ప్రత్యర్థి పార్టీలను బలహీన పరిచేందుకు వ్యూహాలను నిరంతరం అమలు చేస్తూనే ఉంటుంది. వివిద రూపాలలో ఉన్నఆ పార్టీ క్యాడర్ నిరంతరం ప్రజలను తమకు అనుకూలంగా తిప్పుకునే పనిలో నిమగ్నమై ఉంటాయి. వీటన్నిటికి తోడు ప్రధాని మోడీ కేంద్రంగా అభివృద్ధి మంత్రాన్ని వివిధ స్థాయిల్లో ఢంకా బజాయి స్తూనే ఉంటాయి ఆ పార్టీ శ్రేణులు. అన్నిటికి మించి పార్టీకి పుష్కలంగా నిధులున్నాయి. వెరసి, గెలిచిన రాష్ట్రాల్లో మళ్లీ గెలిచేందుకు, ప్రతిపక్షంగా మారిన రాష్ట్రంలో మళ్లీ అధికారం చేజిక్కిం చుకునేందుకు బీజేపీ కసిగా పనిచేస్తుంది. ఇక. కాంగ్రెస్ పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. ఆ పార్టీ వరుసగా ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయి కాని వరుసగా అధికారంలోకి వచ్చిన సందర్భాలు ఇటీవలి కాలంలో లేవు. 2014లో కాంగ్రెస్ హర్యానలో గెలిచినప్పటికీ 2019 నుంచి ఓడిపోతూనే వస్తోంది.

పంజాబ్‌లో అయిదేళ్లు పాలించి ఆప్‌కు అధికారాన్ని అప్పగించింది. అదే బీజేపీ గుజరాత్, హర్యానా వరుసగా మూడుసార్లు గెలిస్తే, అస్సాం, త్రిపుర, గోవా, మణిపూర్, యూపీ, ఉత్తరాఖండ్, మేఘాలయ, నాగాలాండ్, సిక్కింలలో వరుసగా రెండుసార్లు గెలిచింది. కాంగ్రెస్‌తో పోలిస్తే తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, జేఎంఎం వంటి ప్రాంతీయ పార్టీలు వరుస విజయాలు సాధించాయి. కాంగ్రెస్‌లో ఆ కసి ఎందుకు కనపడడం లేదు?అదానీ, కులగణన, రాజ్యాంగాన్ని కాలరాయడం ప్రజా సమస్యలు కావా? వాటికి అనుకూలంగా ప్రజలు ఎందుకు స్పందించడం లేదు? అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వర్కింగ్ కమిటీ సమావేశంలో ప్రశ్నించినట్లు తెలిసింది. అదానీని విమర్శించినంత మాత్రాన కాంగ్రెస్ కార్పొరేటీకరణను వ్యతిరేకిస్తుందని ఎవరైనా అనుకుంటారా? అదానీపై మిత్రపక్షాలలో కూడా ఏకాభిప్రాయం లేదు. కులగణన గురించి ప్రస్తావించినంత మాత్రాన సామాజిక న్యాయం కోసమే కాంగ్రెస్ పుట్టిందని జనం అనుకుంటారా? బీజేపీ దశాబ్దాలుగా ఒకే సిద్దాంతం ఆధారంగా పనిచేస్తే కాంగ్రెస్ ఒక నిర్దిష్ట సిద్దాంతాన్ని దీర్ఘకాలం కొనసాగించలేకపోతోంది. ఓటమి పాలైనపుడు ఎక్కడ లోపం జరిగిందో తెలసుకుని తగిన చర్యలు తీసుకునివుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. సంస్థాగతంగా చేయాల్సిన పెను మార్పులను సూచిం చేందుకు గతంలో ఆంటోనీ, అహ్మద్ పటేల్ లాంటి వారితో కమిటీలు వేసినా వారి సూచనలు అమలు అయిన దాఖలాలు లేవు. ముఠాతత్వం, కుమ్ములాటలు కూడా ఒక కారణమని చెప్పిన ఖర్గే పార్టీ అధ్యక్ష స్థానంలో ఉండి వాటిని ఎందుకు అరికట్టలేకపోతున్నారో ఎవరు చెప్పగలరు? కాంగ్రెస్‌లో యథాతథ పరిస్థితిని ఆకాంక్షించేవారే ఎక్కువ ఉండడం, సమూలంగా మార్పులు చేసేందుకు పార్టీ అగ్రనేతలు సాహసించకపోవడం వల్ల ఆ పార్టీ బీజేపీని ఢీకొనే శక్తిగా ఆవిర్భవించ గలదన్న నమ్మకాలు కలగడం లేదు. అందుకు ప్రధాన కారణం వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న పార్టీలో తుక్కూ, తుప్పూ బాగా పేరుకుపోయి ఉండడం. అంతే కాదు, ఎన్నికలు లేనప్పుడు కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం చాలా స్తబ్దంగా ఉంటుంది. ఆ సమయాన్ని నిర్మాణాత్మకంగా ఉపయోగించుకున్న దాఖలాలు లేవు. ఎన్నికలప్పుడే కాంగ్రెస్ నేతలు జనంలో కనపడతారు. ఎన్నికల పక్రియలో అవకతవకలు జరిగాయన్న విషయంలో కాంగ్రెస్ చూపే అధారాలను ప్రజలు విశ్వసించేలా చేయనంతవరకూ ఈవీఎంలపై ఎన్ని ఆరోపణలు చేసినా ఫలితం ఉండదు. పోలింగ్ బూత్ స్థాయి ఓటర్ల జాబితాపై దృష్టి సారించాలి అని ఖర్గే ఆలస్యంగానైనా గ్రహించారు. బీజేపీ సిద్దాంతం మంచిదా కాదా అన్నది వేరే చర్చ. ఆ పార్టీ తన సొంత ఓటు బ్యాంకు నిర్మించుకుంటూ, పెంచుకుంటూ పోతోంది. కాంగ్రెస్ పూర్తిగా బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకుపై ఆధారపడుతోంది. తన ఓటు బ్యాంకును తానే స్వంతంగా నిర్మించుకోనంతవరకూ కాంగ్రెస్ భవిష్యత్తు

# హరీశ్‌రావును అరెస్టు చేయొద్దు

**- మినహా తదుపరి దర్యాప్తు చేయొచ్చు - విచారణకు వాయిదా**

**హైదరాబాద్, డిసెంబర్ 5:** పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో హరీశ్ రావును అరెస్టు చేయవద్దని హైకోర్టు ఆదేశించింది. అరెస్టు మినహా తదుపరి దర్యాప్తు చేపట్టవచ్చని స్పష్టం చేసింది. దర్యాప్తునకు సహకరించాలని హరీశ్‌రావుకు సూచించింది. హరీశ్‌పై ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్‌కు నోటీసులు జారీసింది. విచారణను వాయిదావేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న హరీశ్ రావును అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ సిద్దిపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి చక్రధర్ గౌడ్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో హరీశ్‌రావుపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలంటూ హైకోర్టులో హరీశ్‌రావు పిటిషన్ దాఖలు చేశారు. పంజాగుట్ట పీఎస్‌లో తనపై తప్పుడు కేసు నమోదు చేశారని అందులో పేర్కొన్నారు. రాజకీయ దురుద్దేశంతో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారని ఆయన తెలిపారు. నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌పై ముందుకు వెళ్లకుండా స్టే ఇవ్వాలని కోర్టును కోరారు. ఈనేపథ్యంలో హరీశ్ రావును అరెస్టు చేయవద్దని పోలీసులకు హైకోర్టు స్పష్టం చేసింది. చక్రధర్ తన ఫోన్ ట్యాపింగ్ అయ్యిందంటూ గతంలోనే హరీశ్‌రావుపై కేసు పెట్టారు. తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారంటూ నిరుడు ఆగస్టు 29న తనకు ఆపిల్ కంపెనీ నుంచి మెయిల్ వచ్చిందని ఈ ఏడాది జూన్ 19న డీజీపీకి ఫిర్యాదు చేశారు. తర్వాత పోలీసులు పట్టించుకోవడం లేదని హైకోర్టును ఆశ్రయించారు. హెూంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, హరీశ్‌రావును ప్రతివాదులుగా చేర్చుతూ జూలై 16న రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు విచారణకు స్వీకరించిన తర్వాత నవంబర్ 22న చక్రధర్ తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. మళ్లీ ఇదే అంశంపై పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చక్రధర్‌కు హరీశ్‌పై అనుమానం ఉంటే రిట్ పిటిషన్‌ను ఎందుకు ఉపసంహరిం చుకున్నారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. హరీశ్‌రావు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ద్వంద్వ నీతిని వీడియో ఆధారాలతో సహా బయటపెట్టిన నేపథ్యంలోనే కక్షతో మంగళవారం కొత్తగా కేసు నమోదు చేయించారని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హరీశ్‌పై నాలుగు కేసులు నమోదయ్యాయి.

# కార్పొరేటర్ నుంచి ముఖ్యమంత్రి వరకు

**హైదరాబాద్, డిసెంబర్ 5:**



మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడణవీస్ గురువారం ప్రమాణ స్వీకార చేస్తున్నారు. ఆయనకు ఈ పదవి ఊరకే దక్కలేదు. నాలుగు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత, రాష్ట్రంలో బీజేపీని అతిపెద్ద పార్టీగా నిలబెట్టడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఫడణవీస్ దాదాపు 30 ఏళ్లుగా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఆయన కుటుంబానికి ఆర్ఎస్ఎస్ తో అనుబంధంతో పాటు, రాజకీయ నేపథ్యముంది. తండ్రి గంగాధర్ ఫడణవీస్ బీజేపీ కీలక నేతల్లో ఒకరు. ఆయన చాలా ఏళ్లపాటు ఎమ్మెల్యేగా కొనసాగారు. విద్యార్థి దశలో ఏబీవీపీ నేతగా ఎదిగారు. గడ్కరీ అడుగుజాడల్లో నడుస్తూ, ఆ తర్వాత కొద్దికాలానికే రాజకీయాల్లో క్రియాశీలకంగా మారారు. 1992లో, 22 ఏళ్లకే కార్పొరేటర్‌గా నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అడుగుపెట్టారు. అలా ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. ఇతర రాజకీయ నాయకులతో పోలిస్తే ఆయన సులువుగానే రాజకీయాల్లోకి వచ్చారని చెప్పవచ్చు. 1992లో తొలిసారి కార్పొరేటర్ అయ్యారు, నిజానికి ఆ ఎన్నికలు 1989లో జరగాల్సి ఉంది. అప్పటికి ఆయనకు వయసు సరిపోదు, కానీ అదృష్టవశాత్తూ ఆ ఎన్నికలు వాయిదాలు పడడంతో చిన్నవయసులోనే కార్పొరేటర్ అయ్యారు. ఆ తర్వాత, చిన్నవయసులోనే నాగ్‌పూర్ మేయర్ అయ్యారు. అనంతరం, శివసేన – బీజేపీ తొలి సంకీర్ణ ప్రభుత్వం కూలిపోవడంతో జరిగిన 1999 ఎన్నికల్లో గెలిచి మొదటిసారి శాసన సభలో అడుగుపెట్టారు. ఫడణవీస్ రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్లలో నాగ్‌పూర్, విదర్భ ప్రాంతాల్లో నితిన్ గడ్కరీ హవా నడిచేది. ఫడణవీస్ ఆయన అడుగుజాడల్లోనే రాజకీయంగా తొలి అడుగులు వేశారు. ఆ తర్వాత మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో గడ్కరీని వీడి, ఆయన ప్రత్యర్థి గోపీనాథ్ ముండే వర్గానికి దగ్గరయ్యారు. అలా, 2013లో బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని దక్కించుకోగలిగారు. దేవేంద్ర ఫడణవీస్‌ను ఆర్ఎస్ఎస్‌లో కీలక సభ్యుడిగానూ, అధిష్టానానికి విధేయుడిగానూ చెబుతారు. అది ఆయనకు మేలు చేసింది. మరో విషయమేంటంటే, 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత మోదీ – షా సారథ్యంలోని బీజేపీ నితిన్ గడ్కరీకి అంత అనుకూలంగా లేదని చెబుతుంటారు. అదే సమయంలో, రాష్ట్రాల్లో మెజారిటీ వర్గానికి చెందిన నాయకుడిని కాకుండా, మైనారిటీ వర్గానికి చెందిన నాయకుడిని ముఖ్యమంత్రిని చేసే వ్యూహాన్ని బీజేపీ అమలు చేసింది. అలా మరాఠాయేతరుడైన దేవేంద్ర ఫడణవీస్‌కు మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవి దక్కింది. ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లలో ఫడణవీస్ మహారాష్ట్రలో అధికార కేంద్రంగా ఎదిగారు. మోదీ అడుగుజాడల్లో నడుస్తూ, ఒకవైపు అభివృద్ధి ఇమేజ్, మరోవైపు పార్టీలో తన ప్రత్యర్థులను తగ్గించుకోవడం వంటి వ్యూహాలను అమలు చేశారు. నిజానికి, సొంత పార్టీలోని ప్రత్యర్థులనే ఫడణవీస్‌కు పెద్దసవాల్ అంటారు విశ్లేషకులు. నితిన్ గడ్కరీ, ఏక్‌నాథ్ ఖడ్సే, పంకజ ముండే, వినోద్ తావ్డే, చంద్రకాంత్ పాటిల్‌లను ఆయనకు ప్రత్యర్థులుగా భావిస్తారు. వీరిలో నితిన్ గడ్కరీ కేంద్ర మంత్రిగా జాతీయ రాజకీయాల్లోకి వెళ్లాల్సి రావడంతో రాష్ట్ర రాజకీయాల్లో జోక్యం తగ్గిపోయింది. ఇతర ప్రత్యర్థుల దారులు కూడా మూసుకుపోవడంతో ఫడణవీస్‌కు దాదాపు అడ్డంకులు తొలగాయి. మంత్రులుగా ఉన్న ఏక్‌నాథ్ ఖడ్సే, పంకజ ముండే, వినోద్ తావ్డేలు వరుస వివాదాలతో ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. దాంతో ఇప్పుడు మహారాష్ట్ర బీజేపీలో తిరుగులేని నేతగా కొనసాగుతున్నారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101